## గడువులోగా
# ఎల్ఆర్ఎస్ గగనమే!

- మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- పరిశీలనకు నోచుకోని లక్షలాది దరఖాస్తులు
- సర్కారు ఒత్తిడిపై ఉద్యోగ సంఘాల ఆగ్రహం
- కసరత్తు లేకుండా గడువు ఏంటని మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రకటించిన లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్-ఎల్ఆర్ఎస్ ఆర్భాటపు ప్రకటన అని, ఆచరణ అసాధ్యమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా హడావుడిగా ప్రకటన చేశారమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన దరఖాస్తులు, పరిష్కరించేందుకు కావాల్సిన సిబ్బంది మధ్య పొంతన లేకపోవడమే ఇందుకు కారణమని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ కోసం 25.60 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఫీజులు చెల్లించి పరిష్కారానికి నోచుకున్నవి 3 లక్షలకు మించలేదు. ఇంకా 22 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మార్చి 31 లోగా పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులకు గడువు విధించింది. దరఖాస్తుదారులు గడువులోగా పరిష్కరించుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తామని వెల్లడించింది. కానీ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. లక్షలాది దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎంత సమయం పడుతుంది? ఎంత సిబ్బంది అవసరం? అనే విషయాలను పట్టించుకోకుండా ఆగమేఘాలపై ప్రకటన ఎలా చేస్తారని ఉద్యోగ సంఘంలో ఓ కీలక నాయకుడు ప్రశ్నించారు.

**దరఖాస్తుల కుప్పలు.. అధికారుల తిప్పలు**

రాష్ట్రంలోని ఎల్ఆర్ఎస్ కోసం దాఖలైన దరఖాస్తుల్లో కేవలం 10 శాతం కూడా అధికారులు పరిష్కరించలేదు. కొన్ని మున్సిపాలిటీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా పరిష్కారం కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజల్, బడంగ్‌పేట్‌లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి. మరోవైపు రోజూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నదని మున్సిపల్ అధికారులు వాపోతున్నారు. సిబ్బంది లేకుండా తాము మాత్రం ఏం చేయగలమని నిలదీస్తున్నారు. ప్రభుత్వం తమకు ఎన్ని డెడ్‌లైన్లు విధించినా, ప్రజలకు ఎన్ని రాయితీ ఆఫర్లు ప్రకటించినా సిబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించలేమని తేల్చిచెప్తున్నారు.

**ఉచిత ఎల్ఆర్ఎస్ ఉత్తముచ్చటేనా!**

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు 25 శాతం రాయితీ అంటూ మాట మార్చిందని రాజకీయవర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ హామీని నమ్మి ఓటేసిన ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండి చేయి చూపించిందని పలువురు నేతలు మండిపడుతున్నారు. ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఉత్తముచ్చటైందని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేకుండా స్థానిక ఎన్నికల్లో లబ్ధికోసమే హడావుడి చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.



## పీఎం సెక్రటరీగా శక్తికాంత దాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు కీలక పదవివరించింది. ప్రధాని నరేంద్ర మోదీ రెండో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రస్తుతం గుజరాత్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ పీకే మిశ్రా ప్రిన్సిపల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. తమిళనాడుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అయిన దాస్ నియామకానికి ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధానమంత్రి పదవికాలం ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్యులు వచ్చేవరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. 42 ఏండ్లుగా సివిల్ సర్వెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన..25వ ఆర్బీఐ గవర్నర్‌గా విధులు నిర్వహించారు కూడా.

## జియోటెలీతో థామ్సన్ క్యూలెడ్ టీవీ

ధర రూ.18,999





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్..దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా జియోటెలీ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే 43 అంగుళాల క్యూలెడ్ టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.18,999 ప్రారంభ ధరతో ఫ్లిప్‌కార్ట్‌లో ఈ టీవీ లభించనున్నదని పేర్కొంది. జియోటెలీ ఓఎస్ ఆధారిత టీవీలను విడుదల చేయడానికి జియోతో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ థామ్సన్ క్యూలెడ్ టీవీతోపాటు జియోహాట్‌స్టార్‌ను మూడు నెలలపాటు, జియోసావన్ మూడు నెలలు, జియోగేమ్స్ నెలపాటు ఉచితంగా అందిస్తున్నది. అలాగే రూ.499 విలువైన స్విగ్గీ ఫుడ్ ఆర్డర్‌పై రూ.150 తగ్గింపు కల్పిస్తున్నది.

# ఈ మార్కెట్లకు ఏమైంది..

**రూ.లక్షల కోట్లలో కరిగిపోతున్న మదుపరుల సంపద**

**వరుస నష్టాల్లో సూచీలు.. అదానీ, అంబానీలకు భారీ షాక్‌లు**

**ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.2.5 లక్షల కోట్ల విలువను కోల్పోయిన బడా కార్పొరేట్ సంస్థలు**




ముంబై, ఫిబ్రవరి 22: భారతీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరులకు షాక్ మార్కెట్లుగా తయారవుతున్నాయి. ప్రధాన సూచీలు వరుస నష్టాల్లో కదలాడుతుండటంతో లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోతున్నది మరి. అటు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ)లోని సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)లోని నిఫ్టీ.. రెండింట్లోనూ నమోదైన కంపెనీల విలువ గతకొద్ది రోజులుగా దారుణంగా పడిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

**ఇదీ సంగతి..**

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ముఖ్య కారణాల్లోకి వెళ్తే.. పలు దేశ, విదేశీ పరిణామాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ఏర్పడ్డ వాణిజ్య యుద్ధం భయాలు, నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్, ఆశించిన స్థాయిలో లేని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల తగ్గింపులు, పడిపోతున్న భారత జీడీపీ, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, పడకేసిన పారిశ్రామికోత్పత్తి వంటివి దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 2,827.95 పాయింట్లు, నిఫ్టీ 848.90 పాయింట్లు కోల్పోయాయి.

**అదానీ టాప్ లూజర్**

ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ సంస్థల స్టాక్స్ విలువ భారీగా పడిపోయింది. 11.9 బిలియన్ డాలర్లు (రూ.లక్ష కోట్లపైనే) హరించుకుపోయింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ 2.94 బిలియన్ డాలర్లు (రూ.25వేల కోట్లపైనే) క్షీణించింది. దిలీప్ సంఘ్వీ, శివ్‌నాడార్, రవీ జైపూరియా వంటి బడా కార్పొరేట్ కంపెనీల విలువ సైతం బాగానే పతనమైంది. అందరిదీ కలిపితే రూ.2.5 లక్షల కోట్లదాకా నష్టం ఉంటున్నది. మరోవైపు ఈ దెబ్బకు బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో ముకేశ్ అంబానీ స్థానం 17 (87.7 బిలియన్ డాలర్లు)కు, గౌతమ్ అదానీ ర్యాంక్ 23 (66.8 బిలియన్ డాలర్లు)కు దిగజారాయి. అయితే ఇప్పటికీ ఆసియా దేశాల్లోని సంపన్నుల్లో అగ్రస్థానంలో ముకేశ్, ఆ తర్వాత అదానీయే ఉన్నారు.

**ఎఫ్ఐఐలు దూరం**

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసుకుంటూనే ఉన్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ నెల్లోనూ రూ.40,436.17 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.1,18,436.17 కోట్లు వెనక్కి పోయినట్టైంది. ఇక దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయని చెప్పవచ్చు. నిజానికి గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు.

## ఇద్దరు ఐపీఎస్‌ల రిలీవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారులను కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. రోడ్ సేఫ్టీ డీజీగా పనిచేస్తున్న అంజనీకుమార్, రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీజీ అభిలాష బిస్తను రిలీవ్ చేస్తూ సీఎస్ శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని వారిని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి రిలీవింగ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఈసీ నిర్ణయంపై ఆయన రిలీవింగ్ ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి కేటాయించిన కొందరు అధికారులు క్యాట్ ఉత్తర్వుల మేరకు తెలంగాణాలోనే పనిచేస్తున్నారు.

## హైవేల నిర్వహణకు బడ్జెట్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల నిర్వహణ కోసం రూ. 23.18 కోట్లు, వరదకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లు, భవనాల మరమ్మతులకు 18.26 కోట్లు విడుదల చేశారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ , ఎన్‌హెచ్ హైదరాబాద్‌కు మూడో త్రైమాసికానికి బడ్జెట్ విడుదల చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వు జారీచేశారు.

## 30 నిమిషాల్లో మొబైల్ డెలివరీ

**ఆన్‌లైన్లో బుకింగ్ చేసుకున్నవారికి అందిస్తున్న సంగీత మొబైల్స్**




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మొబైల్, స్మార్ట్‌గాడ్జెట్ ఉత్పత్తుల విక్రయాల్లో అగ్రగామి సంస్థ సంగీత మొబైల్స్ తన పంథాను మార్చుకుంటున్నది. ఈ-కామర్స్ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి వినూత్న సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్‌ను బుకింగ్ చేసుకున్న 30 నిమిషాల్లోనే ఇంటికి డెలివరీ చేసే విధంగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతానికి ఈ వినూత్న సేవలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంగీత మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ మొబైల్ డెలివరీ సేవలను త్వరలో ముంబై, నోయిడాలో అందిస్తున్నట్లు, తర్వాతి క్రమంలో దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. మెట్రో నగరాలతోపాటు చిన్న స్థాయి పట్టణాల్లో కూడా బుకింగ్ చేసుకున్నవారికి డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. స్టోర్లలో లభించనున్న అన్ని ఆఫర్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి కూడా వర్తించనున్నాయన్నారు. మరోవైపు, బెంగళూరులో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సైతం త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ స్టోర్‌లో కృత్రిమ మేధస్సు టెక్నాలజీతో రూపొందించిన అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు లభించనున్నాయన్నారు.

## హైదరాబాద్‌లో ష్నైడర్ మరో ప్లాంట్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్..భారత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించబోతున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో ప్రారంభమైన ఎలక్రామా 2025 సదస్సులో ష్నైడర్ ఎలక్ట్రిక్ సీఈవో ఒలివర్ బ్లూమ్ మాట్లాడుతూ..భారత్‌లో పెట్టుబడుల పరంపర కొనసాగుతున్నదని, భవిష్యత్తులో మరో మూడు ప్లాంట్లను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు దేశీయంగా 31 యూనిట్లు ఉండగా, కొత్తగా హైదరాబాద్‌తోపాటు కోల్‌కతా, అహ్మదాబాద్‌నగర్‌లలో కొతత ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. వీటికి ఎంతమేర పెట్టుబడులు పెడుతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం భారత్..డిజిటలైజేషన్, సస్టెనబిలిటీ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. వచ్చే 25 ఏండ్లలో వాతావరణ కాలుష్యాన్ని 75 శాతం తగ్గించడానికి టెక్నాలజీ పరంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు, ముఖ్యంగా డిజిటల్ గ్రిడ్లను ఏర్పాటు చేయడం, ఐవోటీ ఆధారిత విద్యుత్ సరఫరాను చేయడం ద్వారా ఇది సాధ్యమవుతున్నదన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి రూ.3,200 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు గతంలోనే ప్రకటించింది.

## చోరీ కేసులో నిందితుడి రిమాండ్



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: చోరీ కేసులో వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని దేవునిపల్లి, కొట్టాల గ్రామాల్లో గత ఏడాది డిసెంబర్ 16న అర్ధరాత్రి ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేసిన కేసులో దర్యాప్తు కొనసాగుతున్నదన్నారు. దీనిలో భాగంగా మెదక్‌కు చెందిన జ్ఞాన్‌సింగ్, మరో ఇద్దరు గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారితో కలిసి దొంగతనం చేసినట్లు గుర్తించారు. మొదటి నేరస్తుడైన జ్ఞాన్‌సింగ్‌ను పట్టుకొని విచారించగా నేరం అంగీకరించాడన్నారు. అతడి నుంచి సుమారు 50 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని కామారెడ్డి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

**చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్**

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 22: తాడ్వాయి మండలం సంగోజీవాడి గ్రామంలో వారం రోజుల క్రితం జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల17న గ్రామానికి చెందిన గడ్డం రాజవ్వ ఇంట్లో చోరీ జరిగింది. 18న అదే గ్రామానికి చెందిన గంట రాజశేఖర్, గడ్డం సత్తెవ్వ ఇండ్లలో చోరీ చేశారు. ముగ్గురు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, సంగోజీవాడి గ్రామానికి చెందిన దోమకొండ అనిల్, గడ్డం బాల్‌రాజ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఏడు గ్రాముల బంగారం, 10 తులాల వెండి పట్టీలు, సౌండ్ బాక్సుతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### తల్లీ పిల్లల అదృశ్యం



అదృశ్యమైన తల్లి, చిన్నారులు

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 22: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రేవతి, కుమారుడు రిత్విక్, కూతురు రియాన్షి అదృశ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేవతికి భర్త రంజిత్‌తో పలుమార్లు సంసార విషయంలో గొడవలు జరిగాయి. ఈ నెల 19న సైతం ఇరువురు గొడవపడ్డారు. 20న గొర్రెలు మేపడానికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్న రంజిత్‌కు భార్య, పిల్లలు ఇంట్లో కనబడలేదు. దీంతో బంధువుల ఇండ్ల వద్ద, ఇంటి పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రంజిత్ శనివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. రేవతి ఆచూకీ తెలిసిన వారు తాడ్వాయి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## కూల్‌డ్రింక్ అనుకొని పురుగుల మందుతాగిన చిన్నారులు

**ఒకరి పరిస్థితి విషమం**

రామారెడ్డి, ఫిబ్రవరి 22: మండలంలోని స్కూల్ తండా గ్రామంలో అక్కాచెల్లెలు కూల్‌డ్రింక్ అనుకొని పురుగుల మందుతాగిన విషయం కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండ్రి వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కూరగాయలకు పిచికారీ చేస్తానని థమ్సప్ బాటిల్లో పురుగుల మందు నింపుకొని పెట్టుకున్నాడు. చిన్నారులు అక్క (10), చెల్లెలు (7) ఇంట్లోపెట్టిన బాటిల్‌ను కూల్ డ్రింక్ అనుకొని తాగి స్పృహతప్పి పడిపోయారు. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చెల్లెలు పరిస్థితి విషమంగా ఉన్నదని స్థానికులు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాలిక



## నాగన్న బావిని సందర్శించిన గురుకుల విద్యార్థులు

రామారెడ్డి, ఫిబ్రవరి 22: ఉప్పల్‌వాయి గురుకుల విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా లింగంపేట్ మండలంలోని నాగన్న మెట్ల బావిని శనివారం సందర్శించారు. బావిచరిత్ర తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శివరాం, పీఎంశ్రీ కో-ఆర్డినేటర్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఎల్లారెడ్డి కమిటీ ఎన్నిక



ఎల్లారెడ్డి పట్టణ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: ఎమ్మార్పీఎస్ ఎల్లారెడ్డి పట్టణ నూతన కమిటీని శనివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగల్ల శివానందం సమక్షంలో నాయకుడు కంతి పద్మారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ వద్ద ఎన్నికలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షులుగా సాయిబాబు, కిషన్, భూమేశ్, సంతోష్, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, కోశాధికారిగా కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాశీరాం, సలహాదారులుగా లక్ష్మయ్య, సాయిబాబా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు మహేందర్, మాణెయ్య తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బిచ్కుంద, ఫిబ్రవరి 22 : వేసవిని దృష్టిలో ఉంచుకొని పల్లెప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం జుక్కల్ మండలంలోని కేంరాజ్ కల్లాలి గ్రామంలో కంపోస్టు షెడ్డు, పల్లె ప్రకృతివనం, నర్సరీని పరిశీలించారు. గ్రామంలో సేకరించే తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగు కాలువలు, వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పేర్కొన్నారు.

### నేడు గురుకుల ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి/ మాక్లూర్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలోని ఉమ్మడి గురుకులాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ధర్మారం (బీ)సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని సూచించారు. తమ వెంట హాల్‌టికెట్, పరీక్షా ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో తెచ్చుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లో ఏమైనా తప్పిదాలు ఉంటే విద్యార్థులు చదువుతున్న పాఠశాల నుంచి బోనాఫైడ్ సర్టిఫికెట్ లేదా ఆధార్‌కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సుద్దపల్లి గురుకుల పాఠశాలలో సైతం ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ నళిని ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నృత్య పోటీలు



నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం నృత్య పోటీలు జరిగాయి. సోలో, గ్రూప్ డ్యాన్స్‌ల పోటీల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు సంస్కృతిని ప్రతిబింబించే వేషధారణ, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, కల్చరర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శంకరయ్య, టీఎస్‌కేసీ ఇన్‌చార్జి శివకుమార్, అధ్యాపకులు నాగణిక, అరుణ్‌కుమార్, గంగారెడ్డి, సిద్ధురాజు, కృష్ణ ప్రసాద్, గోదావరి, శశిధర్, రాణి, సంతోష్, మోయిన్, సంగీత, దశరథ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## గడి కోటలో ఉర్దూ సాహిత్య సమావేశం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

బీబీపేట్ (దోమకొండ), ఫిబ్రవరి 22 : దోమకొండలోని గడి కోటలో ఉర్దూ సాహిత్య సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిఖీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సజ్జద్ షాహిద్, జాదేశ్ రాణిబావా, ప్రొఫెసర్ గులే రాణి, ప్రొఫెసర్ నిఖత్ నాజిత్‌అలీ, అబ్బుత ఖవి తదితర వక్తలు ఉర్దూ భాష, తదితర అంశాలపై అభిప్రాయాలు, ఉర్దూ ప్రత్యేకతను గురించి తెలియజేసినట్లు గడి ట్రస్టు మేనేజర్ బాబ్జీ తెలిపారు. అనంతరం వక్తలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు, వక్తలు, ట్రస్టు ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి దారి చూపండి

**అధికారులకు ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తుల వినతి**



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై పుష్పరాజ్

రాజంపేట్, ఫిబ్రవరి 22: మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఉన్న సంగమేశ్వరాలయానికి రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరారు. సంగమేశ్వర ఆలయం వద్ద ప్రతిఏటా నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ప్రధాన రోడ్డుపైన వాగు వద్ద కొత్తగా బ్రిడ్జి నిర్మించడంతో ఆలయానికి వెళ్లే దారి మూసుకుపోయిందన్నారు. ఆలయం పక్కనే ఉన్న లావణి పట్టా భూమిలో నుంచి ఆలయానికి దారి ఇవ్వాలని పట్టాదారులను గ్రామస్తులు కోరగా.. ఇరువురి మధ్య వాదనలు జరిగాయి.

ఈ సమస్యను పరిష్కరించి ఆలయానికి దారి చూపాలని కోరుతూ గ్రామస్తులు గతంలో ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గ్రామస్తులు శనివారం తహసీల్దార్‌ను కలువగా ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పంపించడంతో.. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తాత్కాలిక పరిష్కారం చూపినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**నగదు, నగలు అపహరణ**

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 22 : నగరంలోని హబీబ్‌నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని మహ్మద్ మోసిన్ శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో మహారాష్ట్రలో ఓ శుభకార్యానికి వెళ్లారు. తాళం ఉన్న ఇంటిని గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. బీరువాను ధ్వంసం చేసి అందులోని 4 తులాల బంగారు నగలు, 30 తులాల వెండి, కొంత నగదును ఎత్తుకుపోయారు. శనివారం ఉదయం ఇంటి తాళం ధ్వంసం చేసి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. యజమానికి సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.